క్లుప్తంగా

కందుల కొనుగోలు కేంద్రం పరిశీలన



కందుల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీఓ శ్రీనివాస్

గుంతకల్లు: స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆర్‌డీఓ శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంత మంది రైతులతో ఎన్ని క్వింటాళ్ల కందులు కొనుగోలు చేశారు? రైతులకు ఏమైనా ఇబ్బందుల ఉన్నాయా? తదితర విషయాలపై ఆరా తీశారు. దాదాపు 7600 క్వింటాళ్ల కందులను రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. తుకాల్లో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూసుకోవాలని ఆర్‌డీఓ సూచించారు. తహసీల్దార్ రమాదేవి, ఏఓ విజయ్‌బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల అధికారి శ్రీధర్

శింగనమల: ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల అధికారి శ్రీధర్ సూచించారు. బుధవారం పి.జలాలపురంలోని ఆర్డీటీ పాఠశాలలో ఎంఎస్ఎంఈ యూనిట్లను నమోదుపై ఉద్యమ్ రిజిస్ట్రేషన్, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న తరహా పరిశ్రమలు పెట్టుకునేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ జబ్బార్ మియా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి కౌన్సిలర్లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

కాలువపైనే కూరగాయల మార్కెట్

- పోలీస్‌స్టేషన్ స్థలానికి ఎసరుపెట్టిన 'తమ్ముళ్లు'
- అప్రమత్తమైన పోలీస్ అధికారులు
- రూ.లక్షల ప్రజాధనం దుర్వినియోగం

పామిడి: టీడీపీ నాయకుల స్వార్థంతో విశాలస్థలంలో ఏర్పాటు కావాల్సిన కూరగాయల మార్కెట్ కాస్త కాలువపైకి చేరింది. దీంతో పాటు రూ.లక్షల పంచాయతీ నిధులు దుర్వినియోగమయ్యాయి. వివరాలు..పట్టణంలోని మెయిన్ బజార్, సంత మార్కెట్ వీధిలో కూరగాయలు దుకాణాలు నిర్వహించేవారు. అయితే సంతమార్కెట్ వీధిలో ఇంటి నిర్మాణాలు చేపట్టడంతో స్థల సమస్య ఏర్పడింది. మెయిన్ బజార్‌లో కుంచించుకపోవడంతో కూరగాయలు వ్యాపారులు బీసీసీ రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఇటీవల పంచాయతీ ఆధ్వర్యంలో ఆక్రమణల తొలగింపుతో కూరగాయల వ్యాపారులకు దుకాణాల నిర్వహణ ఇబ్బందిగా మారింది. దీన్ని ఆసరా తీసుకున్న టీడీపీ నేతలు వారికి మంచి స్థలం చూపిస్తామని



పామిడి పోలీస్‌స్టేషన్ పక్కన ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్

చెప్పి భారీగా ముడుపులు పుచ్చుకుని తమ ప్రణాళికను అమలు చేసినట్లు సమాచారం. ఈక్రమంలో ఏకంగా పోలీసుస్టేషన్‌కు సంబంధించిన స్థలానికే ఎసరు పెట్టినట్లు తెలుస్తోంది. అనుకున్నదే తడవుగా స్థానిక ఎమ్మెల్యే ద్వారా జిల్లా పోలీసు ఉన్నతాధికారిని స్థలం ఇచ్చేలా ఒప్పించారు.

రూ.25 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం..

పోలీసుస్టేషన్ స్థలంలో షాపులు ఏర్పాటు చేసుకునేందుకు కాలువ అడ్డంకిగా మారడంతో డ్రైనేజీ ఏర్పాటు చేసి దానిపై స్లాబ్ వేశారు. ఇందుకోసం పంచాయతీ నిధులు రూ.25 లక్షలు వెచ్చించారు. ఇటీవలే ఎమ్మెల్యేతో మార్కెట్‌ను కూడా ప్రారంభింపజేశారు. అయితే పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన స్థలంపై కొంతమంది పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా ఉన్నతాధికారి సబ్ డివిజనల్ అధికారిని పంపి పోలీస్‌స్టేషన్ స్థలంలో కంచె ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చినట్లు సమాచారం. దీంతో 24 సెంట్లలో ఉండాల్సిన మార్కెట్ కాస్త 4 సెంట్లస్థలంలో ఉన్న కాలువపై మాత్రమే నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. డ్రైనేజీ నిర్మాణానికి కూడా రూ.6 లక్షలకు మించి ఖర్చయిండదన్న ఆరోపణలున్నాయి. మరోవైపు గతంలో వచ్చిన వరదలకు కాలువ పొంగిపొర్లి లోతట్టుప్రాంతాలైన నెహ్రూనగర్, టంగుటూరు నగర్, బాలాజీ ఎక్స్‌టెన్షన్, ఎస్సీ హాస్టల్ కాలనీలు జలమయమయ్యాయి. ఇప్పుడు కూడా ఏకంగా మార్కెట్ కోసం కాలువనే వినియోగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వైవీఆర్‌ను పరామర్శించిన పెద్దారెడ్డి

గుంతకల్లుటౌన్: సర్వైకల్ సర్జరీ చేయించుకుని నాలుగు నెలల అనంతరం గుంతకల్లుకు విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పరామర్శించారు. బుధవారం వైవీఆర్ నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జిల్లా, స్థానికంగా నెలకొన్న తాజా రాజకీయాలపై చర్చించారు. పెద్దారెడ్డితో నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు, పలువురు అధికారులు వైవీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



వైవీఆర్‌తో మాట్లాడుతున్న కేతిరెడ్డి పెద్దారెడ్డి

వైభవంగా పెద్ద కదిరప్పస్వామి రథోత్సవం

గుంతకల్లు రూరల్: వెంకటాంపల్లి గ్రామ కనుమల్లో వెలసిన పెద్ద కదిరప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో స్వామివారి రథోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. భారీగా తరలి వచ్చిన భక్తజనంతో వెంకటాంపల్లి కొండ ప్రాంతం కిటకిట లాడింది. ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో వేకువ జామునే లక్ష్మీనరసింహ స్వామి వార్ల కల్యాణోత్సవం కనుల పండుగగా సాగింది. ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 49 జంటలకు ఉచిత సామూహిక వివాహాలు నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు అందంగా అలంకరించబడిన రథోత్సవంలో లక్ష్మీనరసింహస్వామి వార్ల ఉత్సవ మూర్తులను కొలువదీర్చి రథాంగహోమం, బలిహరణ పూజలు నిర్వహించారు. అనంతరం వేలాది మంది భక్తుల గోవిందనామస్మరణల మధ్య స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తులకు అన్నదానం చేపట్టారు.



రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన సోదరులు, పెరవళి పారా చిట్టెన్న పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో లక్ష్మీనరసింహస్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు అనంతరం వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలతో పాటు, పట్టువస్త్రాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే ఉచిత సామూహిక వివాహాల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

తాడిపత్రి రూరల్: పట్టణంలో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వీహెచ్‌పీ ఛత్రపతి శివాజీ చిత్రపటాన్ని పట్టణంలోని ప్రధానవీధుల్లో ఊరేగించారు. వీహెచ్‌పీ నాయకులు రాధాకృష్ణ, హిందూ ధార్మికసంస్థల నాయకులు పాల్గొన్నారు.

పామిడి: పట్టణంలో బుధవారం భావసార్క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటాన్ని బంగారు రథంపై పురవీధుల్లో ఊరేగించారు. బీసీసీ రోడ్డులోని ఛత్రపతి శివాజీ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. సమాజ్ నాయకులు, శ్రీనివాసరావు, నాగభూషణరావు, జోజోడే కుమార్, ముకుందరావు, అడ్వకేట్ దత్తు, రామన్, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.



తాడిపత్రిలో శివాజీ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

యాడికి: నిద్రలోనే లారీ డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందిన ఘటన వేములపాడు సమీపంలో బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు..తాడిపత్రికి చెందిన లారీడ్రైవర్ నరసింహులు(43)కు భార్య నాగరత్నమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మంగళవారం రాత్రి అతడు లోడుతో కర్ణాటకకు బయలుదేరారు. నిద్ర ఎక్కువ వస్తుండటంతో వేములపాడు క్రాస్ సమీపంలో లారీని ఆపి నిద్రించారు. తెల్లవారు జామున క్లీనర్ డ్రైవర్‌ను లేపేందుకు యత్నించగా నిద్రలేవలేదు. నిద్రలోనే గుండెపోటుతో మరణించినట్లు గుర్తించి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తాడిపత్రికి తరలించారు.

లింగ వివక్ష నిర్మూలనకు కృషి చేద్దాం

బుక్కరాయసముద్రం: లింగ వివక్ష నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని కొర్రపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని పేర్కొన్నారు. బుధవారం కొర్రపాడులో లింగ వివక్ష నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన తర్వాతే ఆడ పిల్లలకు పెళ్లి చేయాలన్నారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ పర్వీన్, ఐకేపీ సీసీ పుల్లారెడ్డి, రాజేంద్ర, రామలక్ష్మి, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

శింగనమల: శింగనమల నియోజకవర్గంలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని కోరారు. బుధవారం ఆమెకు వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తరిమెల గిరి, జిల్లా సహాయ కార్యదర్శి రాచేపల్లి సూర్యప్రకాష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. శింగనమల జూనియర్ కళాశాలలో సైన్స్ గ్రూపులతోపాటు బాలికల వసతి గృహం ఏర్పాటు చేయాలన్నారు. శింగనమల కళాశాలకు వచ్చే విద్యార్థులకు బస్ సౌకర్యం కల్పించాలన్నారు. గార్లదిన్నె మండలంలో బాలికల వసతి గృహం ఏర్పాటు చేయాలన్నారు. కేజీబీవీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాలలో సీట్ల సంఖ్య పెంచాలన్నారు. మైనారిటీ గురుకుల పాఠశాలకు భవనాలను నిర్మించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సోము, నాగభూషణం, సాయికృష్ణ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఒప్పంద ఉద్యోగులు

యల్లనూరు: ఉమ్మడి జిల్లా ఆప్కాస్ కింద పని చేస్తున్న స్వచ్ఛభారత్ ఎంఆర్‌సీ(మండల రిసోర్స్ కోఆర్డినేటర్స్) ఉద్యోగులు బుధవారం శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో ఒప్పంద ఉద్యోగులుగా ఉన్న తమకు 2024 నుంచి జీతాలు చెల్లించలేదన్నారు. ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లు గోపాల్‌నాయుడు , జిల్లా అధ్యక్షుడు నాగప్ప, ఉమ్మడి జిల్లా ఎంఆర్‌సీలు కలిశారు.

వైఎస్సార్‌సీపీ నేత ఔదార్యం



ట్యాంకర్‌తో తాగునీటిని అందిస్తున్న సంజీవరాయుడు

యాడికి: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడు రాయలచెరువు ఉన్నత పాఠశాల సమీపంలోని కాలనీకి ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేసి ఔదార్యం చాటుకున్నాడు. కాలనీకి తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్ పగిలిపోవడంతో రెండు రోజుల నుంచి కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను గుర్తించిన సంజీవరాయుడు సొంత డబ్బు వెచ్చించి 5 ట్యాంకర్ల నీటిని అందజేశారు.

జగన్‌కు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలం

గుంతకల్లుటౌన్: మిర్చీ రైతుల కష్టాలను తెలుసుకునేందుకు గుంటూరు మిర్చీ యార్డుకు వెళ్లిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డికి తగిన భద్రత కల్పించడంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్‌బాసిద్ విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత కలిగిన జగన్‌కు కనీస భద్రత కల్పించకపోవడం సిగ్గుచేటన్నారు. మాజీ ముఖ్యమంత్రికే భద్రత కల్పించలేని చంద్రబాబు ప్రభుత్వం ప్రజలకు ఏ విధంగా రక్షణ కల్పిస్తుందని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు మాజీ సీఎం జగన్‌కు కట్టుదిట్టమైన భద్రతను కల్పించాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

తాడిపత్రి రూరల్: సజ్జలదిన్నె గ్రామ సమీపంలోని ముళ్ల కంపల్లో పేకాట ఆడుతున్న ముగ్గురిని బుధవారం అరెస్ట్ చేసినట్లు అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. నిందితుల నుంచి రూ.5,600 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోండి

గుత్తి: విద్యార్థుల ఆత్మహత్యలకు కారకులైన కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ డిమాండ్ చేశారు. గుత్తిలో బుధవారం ఆయన ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కార్పొరేట్ యాజమాన్యాలకు విద్యాశాఖ అధికారులు వత్తాసు పలుకుతున్నారన్నారు. కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకునే వరకూ దశలవారీ పోరాటాలు చేస్తామన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు రాజేష్, చరణ్, నరేష్, జిలాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

క్షయపై అప్రమత్తంగా ఉండండి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సునీల్‌కుమార్

తాడిపత్రి రూరల్: క్షయ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సూపర్‌వైజర్ సునీల్‌కుమార్ సూచించారు. క్షయ వారోత్సవాల్లో భాగంగా గన్నెవారిపల్లికాలనీలో బుధవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు వస్తున్నా, సాయంత్రం వేళల్లో జ్వరం వస్తున్నా, ఆకలి లేకపోయిన వెంటనే గళ్ల పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో క్షయ బాధితులకు ఉచితంగా మందులను అందజేస్తామని తెలిపారు. సీహెచ్‌ఓ పద్మజ, ఏఎన్ఎం మల్లిక, ఆశా వర్కర్లు లక్ష్మి, ఆదిరంగయ్య పాల్గొన్నారు.

అరటితోట దగ్ధం

బుక్కరాయసముద్రం: దండువారిపల్లిలో అగ్ని ప్రమాదంలో అరటి తోట దగ్ధమైంది. గ్రామానికి చెందిన బోరెడ్డి వెంకటరెడ్డి 2 ఎకరాల పొలంలో అరటి తోట సాగు చేశాడు. ప్రస్తుతం పంట కోత దశకు వచ్చింది. గుర్తు తెలియని వ్యక్తులు నల్ల కొండకు నిప్పు పెట్టారు. దీంతో పక్కనే ఉన్న అరటి తోటకు నిప్పంటుకుంది. తోటలో అరటి చెట్లు, డ్రిప్పు పైపులు, అరటి చెట్లుకి పెట్టిన సపోర్టు కట్టెలు పూర్తిగా కాలిపోయాయి. ఘటనలో రూ.6 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

సంక్షిప్త సమాచారం

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



మాట్లాడుతున్న తాడిపత్రి సీడీపీఓ సాజిదాబేగం

యాడికి: చిన్నారులకు పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందించాలని తాడిపత్రి సీడీపీఓ సాజిదా బేగం సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బుధవారం రెండో రోజు అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం జ్ఞాన జ్యోతి కార్యక్రమంపై శిక్షణా బుధవారం కొనసాగించారు. ఎంఈఓ రవి నాయక్, ఇన్‌చార్జ్ సీడీపీఓ నాగమణి, సూపర్ వైజర్లు గౌరి, నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించండి

పామిడి: రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని డీఏఓ డీ ఉమామహేశ్వరమ్మ సూచించారు. బుధవారం నీలూరు గ్రామంలో నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. రైతు విశిష్ట సంఖ్య కోసం రైతులు నమోదు చేసుకోవాలన్నారు. ఏఓ డీ లీనా వసుంధర, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

యాడికి: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ ఈరన్న, ఎస్ఐ రమణ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పాఠశాలలతోపాటు బోయరెడ్డిపల్లి సమీపంలో ఉన్న ఆదాని సిమెంట్ కర్మాగారంలోని కార్మికులకు మొబైల్ వాహనం ద్వారా అవగాహన కల్పించారు. ఏఎస్ఐ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం ఉపాధి రుణాలకు ముగిసిన ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: స్వయం ఉపాధి రుణాలకు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ బ్యాంకుల సిబ్బంది ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలను నిర్వహించారు. గుంతకల్లు మండలానికి 35 బీసీ, 5 ఎకనామికల్లీ బ్యాక్‌వర్డ్, మరో 10 కాపు రుణాలను మంజూరు చేశారు. ఆన్‌లైన్‌లో 285 మంది దరఖాస్తు చేసుకోగా 163 మంది హాజరయ్యారు.

గార్లదిన్నె: ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 52 యూనిట్లకుగాను 524 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాబాఫ్రకృద్దీన్ తెలిపారు.

శింగనమల: ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం బీసీ, ఈబీసీ, కాపు రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 538 మంది దరఖాస్తు చేసుకోగా, 408 హాజరైనట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు.

యాడికి: ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో బుధవారం వివిధ కార్పొరేషన్ రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు సజావుగా జరిగినట్లు ఎంపీడీఓ వీర్రాజు తెలిపారు. మొత్తం 735 మంది దరఖాస్తు చేసుకోగా 281 మంది హాజరయ్యారన్నారు.

పామిడి: ఎంపీడీఓ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలు బుధవారం ముగిసాయి. మొత్తం 56 యూనిట్లకుగాను 345 మంది హాజరైనట్లు ఎంపీడీఓ తేజోత్స్న తెలిపారు.

పెద్దవడుగూరు : మండల కేంద్రంలో బుధవారం సబ్సిడీ రుణాల కోరకు బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 376 మంది దరఖాస్తు చేసుకోగా 270 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీఓ బారెన్‌సాహెబ్ తెలిపారు.

చికోటి ప్రవీణ్‌పై చర్యలు తీసుకోవాలి

గుత్తి: గుంతకల్లులో మంగళవారం జరిగిన ఛత్రపతి శివాజీ ఊరేగింపులో పాస్టర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తెలంగాణ బీజేపీ నేత, ధర్మ రక్ష వ్యవస్థాపకులు చికోటి ప్రవీణ్‌పై చర్యలు తీసుకోవాలని గుత్తి పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. గుత్తిలో బుధవారం పాస్టర్లు వైపీ బాబు, వాసు, అనిల్‌కాంత్, అబ్రహామయ్య, జాకోబ్, సాల్మన్ రాజ్, అహరోన్, బింగిబాబు, అమృత్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు. క్రైస్తవం ఎవరినీ ఇబ్బంది పెట్టదని, చీకోటి ప్రవీణ్ అడ్డూఅదుపు లేకుండా మాట్లాడితే తగిన మూల్యం చెల్లించోక తప్పదని హెచ్చరించారు.

గుంతకల్లు: గుంతకల్లులో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకల్లో చికోటి ప్రవీణ్ పాస్టర్ల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని యునైటెడ్ క్రిస్టియన్ వెల్ఫేర్ ఫోరమ్ నాయకులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వెంటనే చికోటి ప్రవీణ్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఫోరమ్ నాయకులు ఏపీ సాల్మన్ విజయ్ రాజ్, ప్రతాప్‌రెడ్డి, జాన్‌బాబు డిమాండ్ చేశారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయె!

తాడిపత్రి రూరల్: పట్టణంలోని ప్రసిద్ధ పార్వతీదేవి బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. శివరాత్రిని పురస్కరించుకుని గురువారం నుంచి వచ్చే నెల వరకూ బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈనేపథ్యంలో అధికారులు ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. భక్తులు ఇబ్బంది పడకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని అధికారులు తెలియజేశారు.



భక్తులను దర్శనమిస్తున్న బుగ్గ రామలింగేశ్వరుడు



విద్యుత్ దీపకాంతులతో వెలిగిపోతున్న ఆలయం



భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిరి